క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న వాసుబాబు


వెల్లమిల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పుప్పాల వాసుబాబు శుక్రవారం వెల్లమిల్లిలో నిర్వహిస్తున్న గ్రామదేవత గంగాలమ్మ జాతర మహోత్సవానికి హాజరయ్యారు. గంగాలమ్మను దర్శించుకొని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కలిసి పార్టీ గురించి చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మరడా మంగారావు, పుప్పాల గోపి, చినబాబు, సర్పంచ్ కుమార్‌రాజు, ఉపసర్పంచ్ నాగు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను త్వరగా ముగించుకోవాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఏసుమణి

దెందులూరు: వేసవి తీవ్రత బారిన పడకుండా త్వరితగతిన పనులను ముగించుకోవాలని దోసపాడు సర్పంచి గోరింక ఏసుమణీఏసోబు అన్నారు. గత మూడు రోజులుగా వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని ఉపాధి శ్రామికులు గమనించి ఉపాధి పనుల్లో వ్యక్తిగత ఆరోగ్య బాధ్యతలు చూసుకోవాలన్నారు. దోసపాడులో శుక్రవారం 300 మందితో ఉపాధి పనులు నిర్వహించారు. ఈ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఏసోబు, బొల్లె రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి కాలువ ఆధునికీకరణ


గోదావరి కాలువ పనులను చేస్తున్న సిబ్బంది

దెందులూరు: గోదావరి కాలువ ఆధునికీకరణ పనులను నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వెలమటి రాంబాబు ఆధ్వర్యంలో పనులను ఆరు జేసీబీలతో గుండుగొలను సెక్షన్ నుంచి ప్రారంభించారు. గోదావరి కాలువ రెండు గట్లను కాలువ వెడల్పు లోతు, తూడు తొలగింపు పనులను గోదావరి కాలువ జూనియర్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. పనులు పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలు, నిబంధనలతో నిర్వహిస్తున్నామన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: పాఠశాలలో చదువు అభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం వండి పెట్టాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్ మనోజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం వంట కార్మికులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజ్‌మనోజు మాట్లాడుతూ వండే ముందు వంట పాత్రలు పరిశుభ్రంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. పరిశుభ్రంగా పాత్రలు కడగాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయాలన్నారు. భోజనాలు బాగోలేదని ఇళ్ల వద్ద నుంచి విద్యార్థులు క్యారియర్లు తెచ్చుకొనే విధానం పోవాలన్నారు. ఎంఈవో వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శిక్షణ ఇచ్చే రిసోర్సు పర్సన్ భారతి మాట్లాడారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమడోలు: కోడూరుపాడుకు చెందిన వృద్ధుడు సిద్ధాబత్తుల మూర్తి (65) అదృశ్యంపై భీమడోలులో శుక్రవారం కేసు నమోదైంది. కుటుంబ సభ్యులు 9 నెలల తరువాత భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన సిద్ధాబత్తుల మూర్తి (65) గత ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీన ఇంటి నుంచి పనుల నిమిత్తం బయటకు వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు అచూకీ కోసం గాలించారు. బంధువులను, పనికి వెళ్లిన ప్రాంతాలను గాలించగా కనిపించ లేదు. దీంతో కుటుంబ సభ్యుడు సిద్ధాబత్తుల రవికిరణ్ భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చింతలపూడి సీఐగా కాంతి కుమార్

చింతలపూడి : చింతలపూడి సీఐగా టి.క్రాంతి కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఇరుకైన రోడ్లు.. ఆపై పార్కింగ్ కష్టాలు

- రోజు రోజుకూ జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో నాబార్డ్ నిధులతో రెండు షెడ్ల నిర్మాణం
- అప్పట్లో ప్రారంభానికి ఎన్నికల కోడ్ అడ్డంకి..
- కూటమి ఏడాది పాలనలో సమస్య పరిష్కార చర్యలు శూన్యం


సంతలో తప్పుకునేందుకు వీలు లేని ప్రధాన రహదారి


వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యాపారుల కోసం నాబార్డ్ నిధులతో నిర్మించిన షెడ్లు

భీమడోలు: ఇరుకైన రోడ్లు.. పార్కింగ్ సమస్యలతో భీమడోలులో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది. జనాభాతో పాటు పెరుగుతున్న వాహనాల సంఖ్య, స్థలాల ధరలు ఆకాశన్నంటడం, రోడ్లు, డ్రెయినేజీలను అక్రమించుకోవడంతో వాహనాల పార్కింగ్‌కు బెత్తడు స్థలం కూడా వదలకుండా ఇష్టానుసారంగా ఇళ్లు, వ్యాపార భవనాలు నిర్మించుకోవడంతో ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అదే విధంగా రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ గ్రామం మీదుగా ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకాతిరుమల వైపు వెళ్లే ప్రధాన రహదారి ఆక్రమణలతో కుచించుకుపోయి ఇరుకుగా మారింది. ఇదిలా ఉండగా భీమడోలులో బుధవారం జరిగే వారపు సంతలో నిత్యం ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. నిత్యం ఇవే రహదారులపై పాలకులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు ఇరుకై న రోడ్లు, సంతమార్కెట్, వ్యాపారాలు, వాహనాల రాకపోకలతో ప్రయాణం కష్టతరంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన పాలకులకు ఏడాది గడిచినా కనిపించకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

నిత్యం రద్దీగా సంత మార్కెట్ రోడ్డు

సబ్ డివిజన్‌కు ముఖ్య పట్టణంగా భీమడోలు కావడంతో పాటు వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలు, జిల్లా నలుమూలల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిత్యం సంత మార్కెట్ దారిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. సంత జరిగే బుధవారంతా రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. జాతీయ రహదారి భీమడోలు వద్ద రైల్వే గేటు నుంచి వాహనాలు వస్తుంటాయి. గేటు వేసి తెరిస్తే వందలాది వాహనాలు ఒక్కసారిగా ఈ రహదారిపై నుంచి వెళుతుంటాయి. దీనితో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమలతో పాటు నల్లజర్ల, దెందులూరు మండలాల్లోని ప్రజలు భీమడోలు గ్రామానికి వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. తోపుడు బండ్లు, కూరగాయాల వ్యాపారులు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని రోడ్లను ఆక్రమించుకుని తమ వ్యాపారాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. కూరగాయాలు, ఆకుకూరలు టోకు వ్యాపారం ద్వారకాతిరుమలకు వెళ్లే రోడ్డు పైనే జరుగుతుంది. ఈ నేపథ్యంలో రహదారిపై రైతులు, వ్యాపారుల వాహనాలను గంటల కొద్దీ నిలిపి ఎగుమతులు, దిగుమతులను చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో సమస్య పరిష్కారానికి చర్యలు

భీమడోలు సంత రోడ్డుపై సాగుతుండడంతో ప్రజలు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ చొరవచూపా రు. అప్పటి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో రెండు షెడ్ల నిర్మాణానికి నాబార్డ్ నిధులు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. దీంతో షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ లోపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభం ఆగిపోయింది.

సంతమార్కెట్ సమస్యపై ప్రత్యేక దృష్టి



సంత మార్కెట్, ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సంతమార్కెట్ కార్యకలాపాలపై గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టిని సారించింది. ఏన్నో ఏళ్లుగా రోడ్డుపై కొనసాగుతోన్న భీమడోలు సంతను వారికి కేటాయించిన లోపలికి మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నాబార్డ్ నిధులతో చేపడుతున్న రెండు షెడ్లు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వినియోగదారులకు ఈ షెడ్ల వద్ద ప్రయోజనం చేకూరుతుంది.

– పాము సునీతా మాన్‌సింగ్, సర్పంచి, భీమడోలు

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



సంత మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఎక్కువ వాహనాలు నిలవకుండా వారికి అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డుపై ఎక్కువ సంత నిర్వహిస్తున్నాం. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సంత మార్కెట్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని చెబుతున్నాం. ఆ దిశగా పాలకులు, అధికారులు కృషి చేస్తున్నారు. షెడ్లు పూర్తయితే సమస్య తీరనుంది.

– వై.సుధాకర్, ఎస్సై, భీమడోలు

రసాయనాల వినియోగంతోనే చీడపీడలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

గణపవరం: రైతులు వీలైనంత తక్కువగా ఎరువులు, పురుగు మందులు వాడాలని, విచ్చలవిడిగా వీటిని వాడితే భూసారం తగ్గడంతో పాటు చీడపీడల సమస్య రెట్టింపు అవుతుందని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ అధికారి పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కేశవరం రైతుసేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్–2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు వీలైనంత తక్కువగా రసాయనాలు వాడాలని, సేంద్రియ పద్ధతుల వైపు మారాలని సూచించారు. డాట్ సమన్వయకర్త కె.ఫణికుమార్ మాట్లాడుతూ సార్వాకు ఎంటీయూ 1318 రకం అనుకూలంగా ఉంటుందని రైతులు వీలైనంత వరకూ ఈ రకం సాగు చేయాలని సూచించారు. అలాగే ఎంటీయూ 1275 మధ్యస్థ సన్నంగా ఉంటుందని, దీనిని ఏ గ్రేడు రకంగా కొనుగోలు చేస్తారని, వర్షాలకు, గాలులకు పడిపోకుండా ఉంటుందన్నారు. ఈ రకం కూడా సార్వా సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పశువైద్య అధికారిణి నాగజ్యోతి మాట్లాడుతూ పశువులకు తప్పకుండా బీమా చేయించుకోవాలని, గడ్డి విత్తనాలు సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తే విత్తనాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హార్టి కల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ బిందు ప్రవీణ, కేశవరం సర్పంచ్ మిడతాని కామేశ్వరి, ఎంపీటీసీ అచ్యుత రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ పి.శారద

భీమడోలు: బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు వస్తాయని, అలా చేయడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంలో శుక్రవారం కిషోరీ వికాసం 2.0 కిశోర బాలికలకు, యువతులకు, మహిళలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, పోష్టికాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శారీర వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత అనే అంశంపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భీమడోలు ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీవో ఎండీ హషనాజ్‌బేగం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ పి.శారద మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలపై అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయని, వాటిన్నింటిపై కిశోర బాలికలు చైతన్యం కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టంపై వారికి అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ఆపదలో ఉన్నట్లయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతారన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది స్వర్ణ, నాగమణి, మహిళా కానిస్టేబుల్ లావణ్య, వీపీఏ స్వర్ణ పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

దెందులూరు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం ఆకుల కొండయ్యకు చెందిన 15 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేశారు. ప్రమాద కార ణాలు, నష్టం విచారణ అనంతరం నిర్ధారిస్తామ ని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ అన్నారు.

ఎంపీహెచ్‌ఎస్‌గా బాల మురళి


ఎం.బాలమురళి

గణపవరం: పీహెచ్‌సీ మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా ముప్పాల బాల మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికివచ్చారు. ఈయనకు వైద్యాధికారిణి పి.కిరణ్మయి పలు సూచనలు చేశారు.

కత్తులతో దాడి.. కేసుల నమోదు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలో ఆస్తి తగాదాల నేపథ్యంలో గురువారం కత్తులతో దాడి చేసుకున్న ఘటనలో గంగరాజు, ఘంటసాల కుమారస్వామి, ఘంటసాల పెద్దిరాజు గాయపడ్డారు. రెండో వర్గం రవీంద్రబాబు, మండల రామరాజుకు గాయాలయ్యాయి. ఇరు వర్గాలు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఇరు వర్గాలపై విచారణ నిర్వహించి కేసులు నమోదు చేశామని ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నిడమర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంలో వైర్లు లాగే పనుల నిమిత్తం నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలో బాదంపూడి రూరల్, కైకరం ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈ అంబేడ్కర్ తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేపల చెరువులకు విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దెందులూరు: మండలంలో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 6గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. రామారావుగూడెం, మలకచర్ల, కేవీన్ పురం, గండివారిగూడెం, ముప్పవరం, తిమ్మన్నగూడెం, మేధినరావుపాలెం, ధర్మారావుపాలెం గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

షైన్ స్టార్ పురస్కారాలకు 'మానస' విద్యార్థులు


ఆర్.నాగమణికంఠ


జె.రేవంత్


ఎం.హర్ష


వి.యామిని మౌనిక


జీ రాంచరణ్ సంజయ్

భీమడోలు: 2024–25 విద్యా సంవత్సరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను చాటిన విద్యార్థులను ప్రభుత్వం షైన్ స్టార్ పురస్కారాలకు ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ పురస్కారాలకు ఎంపికై న విద్యార్థుల జాబితాలను విడుదల చేసింది. ఇందులో భీమడోలులో నలుగురు, గుండుగొలను నుంచి ఒక విద్యార్థిని ప్రతిభ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇద్దరు బీసీబీ, ఇద్దరు ఓసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వారీగా ఎంపిక చేశారు. భీమడోలు మానస ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన రామిశెట్టి నాగ మణికంఠ (592), జె.రేవంత్ (590), ఎం.హర్ష (569), వి.యామిని మౌనిక (555) మార్కులు సాధించి, ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ పేర్కొన్నారు. చదువుల్లో రాణించి, పురస్కారాలకు ఎంపికై న విద్యార్థులను పలువురు అభినందించారు. గుండుగొలనుకు చెందిన శ్రీవిద్యాలయ విద్యార్థి బాలిన రాంచరణ్ సంజయ్ (589) మార్కులు సాధించి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గేదెల సురేష్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు


తన్నీడి చంద్రిక


కాదా సత్యసింహాద్రి


భూక్యా జానకి


ఎంపికైన విద్యార్థిని

గణపవరం: కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలు ఇవ్వడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో గణపవరం, నిడమర్రు మండలాల విద్యార్థులు సత్తా చాటారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. నిడమర్రు మండలం నుంచి ఏకంగా 12 మంది విద్యార్థులు విజయం సాధించారు. గణపవరం మండలం నుంచి ఇద్దరు, పెదనింద్రకొలను ఉన్నత పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన గణిత ఉపాధ్యాయిని జి.సుబ్బలక్ష్మిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. బువ్వనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన తన్నీడి చంద్రిక, కాదా సింహాద్రి ఎంపికైనట్లు హెచ్‌ఎం సంకు ఏసుబాబు తెలిపారు. నిడమర్రు హైస్కూల్ నుంచి ఒక విద్యార్థిని ఎంపికయ్యారు. గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాలకు చెందిన జె.ప్రసన్న, గణపవరం బాలికోన్నత పాఠశాలకు చెందిన భూక్యా జానకి ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట సింహాద్రి అప్పారావు తెలిపారు. విజేతలను వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు,హెచ్‌ఎంలను ఎంఈవోలు గొర్రెల బాలయ్య, ఐ.భాస్కరకుమార్ అభినందించారు.

విజేతలకు అభినందన

దెందులూరు: ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్– 2024 సంవత్సరంలో విజేతల కృషి నిరంతర సాధన అభినందనీయమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందిన ఏరిపోయిన లక్ష్మీప్రసన్న, మరడాని భవ్య, సేనాపతి హిమజ నాగ శివానిలను అభినందించారు. కొవ్వలిలో స్కాలర్‌షిప్ పొందిన బగాతి భార్గవి, కోడి జగదీష్, కొట్టు జగదీష్, మునునూరి దుర్గా జాహ్నవి, సుందరపల్లి జయలక్ష్మి భవానీలను ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.శర్మ అభినందించారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో స్కాలర్‌షిప్‌లను సాధించిన విద్యార్థులు కె.ఆదిత్య వినయ్, టి.శివశంకర్లను పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎం.మనోహర్ అభినందించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలి


దెందులూరు: బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఉంగుటూరు: విద్యార్థులు పోటీ పడే తత్వం అలవరుచుకోవాలని ఉంగుటూరు సర్పంచి బండారు సింధు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చిట్టూరి గంగాధరరావు, భీమేశ్వరస్వామి ట్రస్టీ బోర్డు చైర్మన్ నారాయణం హనుమంతురావు, సీనియర్ రీడర్ కె.అప్పారావు, అడపా శోభారాణి, టి.రాంబాబు, దానమ్మ, టి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి వైపు పయనించాలని పోతునూరు గ్రామ నాయకులు నున్న లక్ష్మణ్, గండి రాజా జాన్ అన్నారు. శుక్రవారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగింపు సమావేశం విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం పోతునూరు గ్రంథాలయ అధికారి జి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకొని వ్యాసరచన, కథలు, ఆటలు, పాటల పోటీల్లో విజేతలైన జూనియర్ సీనియర్ విభాగాల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

భీమడోలు: విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను ఆధిరోహిస్తామని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనాన్ని అలవర్చుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలు, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, శారీరక ఎదుగుదలకు పుస్తక పఠనం దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక ప్రియులుగా మారాలన్నారు. వివిధ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించిన పి.తనూశ్రీని అభినందించారు. చక్కని ప్రతిభను చాటిన దాసరి జయశ్రీలక్ష్మి, రిషిక, రమ్యశ్రీ, హస్యలక్ష్మి, గంటా ఈశ్వర్, గంటా హేమంత్‌లను అభినందించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌టీ అమర్‌నాథ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.జయశ్రీ, సత్యం ఫౌండేషన్ ప్రతినిధి చలమయ్య, ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకురాలు పి.జ్యోతి, వడ్లపట్ల ప్రభాకరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెలవుల్లో విజ్ఞానం పెంచుకోవాలి

గణపవరం: విద్యార్థులు సెలవుల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంచుకోవాలని దాత కామిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. గణపవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం గ్రంథాలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహారావు, సుభాషిణి, గుమ్మడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


భీమడోలు: విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో-1


గణపవరం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు


ఉంగుటూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచి బండారు సింధు

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం: గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు ఆశా వర్కర్ల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ప్రియాంక తెలిపారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని వల్లూరులో ఒకటి, వరదరాజపురంలో ఒకటి ఖాళీగా ఉన్నాయని డా.కిరణ్మయి తెలిపారు. పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని పిప్పర-1. పిప్పర-2, కోమర్రు సచివాలయాల పరిధిలో మూడు ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు 25 సంవత్సరాల వయస్సు నిండి, 45 సంవత్సరాల లోపు ఉండాలని, ఆ గ్రామానికి కోడలుగా ఉండాలని, పదో తరగతి పాస్ అయి ఉండాలన్నారు. నివాస, కుల ధృవీకరణ పత్రాలతో ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులను ఆయా పీహెచ్‌సీల్లో అందజేయాలని వారు సూచించారు.